RNI No - APTEL/2022/81596

# జనోదయ

కరీంనగర్ శనివారం 28.03.2026 సంపుటి : 03 సంచిక : 112 పేజీలు : 08 వెల : రూ.5

తెలుగు దినపత్రిక

Karimnagar Saturday 28.03.2026 Volume: 03 Issue 112 Pages 08 Cost 5/

## ఏఐతో ఉద్యోగం కోల్పోతే..

## కంపెనీలు పరిహారం చెల్లించాలి

**ఏఐ కంపెనీలకు 'పీపుల్ క్రెడిట్స్' విధానం తీసుకొస్తాం**

**ఉద్యోగాలు కోల్పోయినవారికి ప్రభుత్వపరంగా నైపుణ్య శిక్షణ**

**హార్వర్డ్ కెన్నడీ స్కూల్ ఏఐ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్, మార్చి 27:** ఓపెన్ ఏఐ సంస్థ చాట్ జీపీటీని ప్రారంభించిన తర్వాత ప్రతి ఒక్కరి జీవితంలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత భాగమైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఏఐ కారణంగా అనేకమంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, ఈ సమస్యకు తమ ప్రభుత్వం వినూత్న పరిష్కారం అమల్లోకి తేబోతుందని తెలిపారు. ఏఐ వల్ల ఉద్యోగం కోల్పోతే.. ఆ ఉద్యోగికి కంపెనీ పరిహారం చెల్లించేలా ఒక విధానాన్ని తీసుకొస్తామని చెప్పారు. కంపెనీలు విడుదల చేసే కాలుష్యానికి కార్బన్ క్రెడిట్స్ ఉన్నవిధంగానే.. ఏఐ కంపెనీలకు 'పీపుల్ క్రెడిట్స్' విధానాన్ని అమలు చేయాలని ఆలోచిస్తున్నట్లు వివరించారు. అమెరికాలోని బోస్టన్ సిటీలో ఉన్న హార్వర్డ్ విశ్వ విద్యాలయంలోని హార్వర్డ్ కెన్నడీ స్కూల్.. ఏఐపై శుక్రవారం రాత్రి నిర్వహించిన సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడారు. మానవజాతి గొప్ప ఆవిష్కరణల్లో ఏఐ కీలకమైందని.. కానీ, ఇది రెండు వైపుల పదును ఉన్న కత్తి లాంటిదని అన్నారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రతికూల ప్రభావాలు ఎక్కువగా చూపవచ్చని హెచ్చరించారు. ఏఐ సాంకేతికత భవిష్యత్తులో మరింత శక్తిమంతమవుతుందని తెలిపారు. ఏఐతో ప్రాథమిక స్థాయి ఉద్యోగాల సంఖ్య తగ్గే అవకాశం ఉందని చెప్పారు.ఫార్మా, సాఫ్ట్‌వేర్, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, మ్యానుఫాక్చరింగ్, ఏరోస్పేస్, రక్షణ, రిటైల్ రంగాలకు కేంద్రంగా ఉన్న హైదరాబాద్ నగరం ఒక నాలెడ్జ్ సెంటర్ అని సీఎం తెలిపారు. ఈ రంగాల్లో భారీగా ఉద్యోగులను తొలగిస్తే తాము సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. అందుకే భారత్ ఫ్యూచర్ సిటీ అనే కొత్త నగరాన్ని నిర్మిస్తున్నామని, అందులో ఒక భాగాన్ని ఏఐ సిటీగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇక్కడ అన్ని ఏఐ సంస్థలకు ఒకేచోట అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఏఐ అభివృద్ధిలో ప్రపంచానికి కేంద్రంగా భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ప్రకటించారు.

# లాక్‌డౌన్ విధించం

- **టీమిండియాగా పనిచేసి గడ్డుకాలాన్ని అధిగమిద్దాం**
- **పశ్చిమాసియా యుద్ధ సంక్షోభంపై ప్రధాని మోదీ స్పష్టం**



**ఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధంతో ఏర్పడిన పరిణామాల దృష్ట్యా దేశంలో లాక్‌డౌన్ విధించబోతున్నారనే వార్తలను ప్రధాని నరేంద్ర మోడీ ఖండించారు. లాక్‌డౌన్ విధించాలనే ఆలోచనే తమకు లేదని ప్రధాని స్పష్టం చేశారు. శుక్రవారం రాష్ట్రాల ముఖ్యమంత్రులతో, లెఫ్టినెంట్ గవర్నర్లతో అత్యున్నత స్థాయి వర్చువల్ సమావేశం నిర్వహించిన మోడీ ఎల్పీజీ, పెట్రోల్, ఎరువుల కొరతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వ్యాపార స్థిరత్వం, ఇంధన భద్రతపై ఎల్జీ, సీఎంలకు కీలక సూచనలు చేసిన ప్రధాని టీమిండియాగా పనిచేసి ఈ గడ్డు కాలాన్ని అధిగమిద్దామని పిలుపునిచ్చారు.నాలుగు వారాలుగా జరుగుతున్న పశ్చిమాసియా యుద్ధం ప్రభావంతో భారత దేశంలో నెలకొన్న పరిస్థితులపై తొలిసారి ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లతో వర్చువల్‌గా సమా వేశమయ్యారు. కరోనా కాలంలో మాదిరిగానే ఈ కఠినమైన పరిస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీమిండియాగా పనిచేస్తూ అధిగమిద్దామని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు.గ్యాస్, పెట్రోల్, ఎరువుల సరఫరాపై ఆరా తీసిన ప్రధాని పరస్పర సహకారం, సత్వర స్పందనతో వ్యవహరించాలని కోరారు. మార్చి ఆరంభం నుంచి యుద్ధం పర్యావసానాలను మంత్రుల బృందం ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని చెప్పిన ప్రధాని ఈ సమయంలో ఆర్థిక, వాణిజ్య స్థిరత్వం.. ఇంధన భద్రతకు ప్రాధాన్యమివ్వాలని కీలక సూచనలు చేశారు. అంతర్జాతీయంగా కల్లోల పరిస్థితులు నెలకొన్న వేళ పౌరుల ప్రయోజనాలను కాపాడడం, పరిశ్రమలు, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడం చాలా ముఖ్యమని సీఎంలకు ప్రధాని స్పష్టం చేశారు.వ్యవసాయ రంగం విషయంలో ముందస్తు ప్రణాళికల అవసరం ఉందని చెప్పిన మోడీ ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత ఏర్పడ కుండా చూడాలని తెలిపారు. ఎరువుల పంపిణీలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మోడీ సూచించారు. తీర ప్రాంతా లు, సరిహద్దు ప్రాంతాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలని ప్రధాని సూచించారు.

## అయోధ్యలో శ్రీరామనవమి వేడుకలు

**అయోధ్య, మార్చి 27:** అయోధ్యలో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. బాలరాముడి దర్శనానికి లక్షల మంది భక్తులు పోటెత్తారు. అభిజిత్ ముహూర్త సమయంలో రాముడి నుదుటిపైన సూర్యతిలకం చూసి పరవశించిపోయారు. ప్రత్యేకమైన కటకాల సాయంతో రాముడి విగ్రహం నుదుటిపై సూర్యకాంతి 9నిమిషాలు పడేలా అర్చకులు, అధికారులు ఏర్పాట్లు చేశారు. శ్రీరామనవమి సందర్భంగా 14మంది అర్చకులు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కవిత కొత్త పార్టీకి

# ముహూర్తం ఖరారు

- **ఏప్రిల్ 25న జెండా ఆవిష్కరణ**



2లో..

# వైభవోపేతంగా శ్రీ సీతారాముల కల్యాణం

**అంగరంగ వైభవంగా**

**శ్రీరామ నవమి వేడుకలు**

**సీఎం సతీ సమేతంగా పాల్గొని పట్టు వస్త్రాలు, తలంబ్రాల సమర్పణ**

**రూ. 351 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**





**జనోదయ: భద్రాచలం , మార్చి 27:**

భద్రాచలంలోని శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంను అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సతీ సమేతంగా ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.భద్రాచలం మిథిలా స్టేడియంలో నిర్వహించిన శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం వేలాది భక్తుల మధ్య అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి దంపతులు స్వామి, అమ్మ వార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మిథిలా స్టేడియంలో శ్రీ రామచంద్రస్వామి, సీతమ్మ వారికి పూజా కార్యక్రమం, అలంకరణ, తదితర కార్యక్రమాలు నిర్వహించి పెళ్లి కొనసాగించారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు, వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన కళ్యాణ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా అన్ని కార్యక్రమాలను నిర్వహించారు.

**భక్తులతో కిక్కిరిసిన భద్రాద్రి క్షేత్రం..**

భద్రాచలం ఆలయం సర్వాంగ సుందరంగా అలంకరించబడగా, భక్తుల రాక పోకలతో క్షేత్రం కిక్కిరిసిపోయింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలి వచ్చిన భక్తులు శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దర్శనం కోసం భారీగా తరలివచ్చి దర్శనం పొందారు.భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. త్రాగు నీరు, అన్న ప్రసాదం, వైద్య శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించడంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకున్నారు.

**ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

అంతకుముందు ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద 351 కోట్లతో చేపట్టిన ఆలయ అభివృద్ధి తొలిదశ పనులకు భూమి పూజ నిర్వహిం చారు. కార్యక్రమంలో డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కొండా సురేఖ, ఎంపీ పోరిక బలరాం నాయక్, న్యాయమూర్తులు, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్, ఎండోమెంట్ కమీషనర్ హన్మంత రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, పీఓ బి. రాహుల్, అదనపు కలెక్టర్లు విద్యా చందన, వేణుగోపాల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు, లక్షలాది మంది భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఎరువుల కొరత లేదు

**ఆందోళన వద్దు.. లోక్‌సభలో జేపీ నడ్డా**



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ఘర్షణలు కారణంగా ఎరువులు, ముడి పదార్థాల రవాణాలో ఆలస్యం చోటుచేసుకుని రైతులు ఇబ్బందులు పడుతున్నారంటూ వస్తున్న వార్తలపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా (జీూ చీఝఎఝ) లోక్‌సభలో స్పందించారు. ఎరువులపై యుద్ధ ప్రభావం పడకుండా రైతుల అవసరాలకు సరిపడా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. ఔషధాల తయారీకి ఇతర దేశాల నుంచి ముడిసరుకు దిగుమతిపై ఆధారప డటాన్ని తగ్గించుకునేందుకు కూడా చర్యలు చేపట్టామని చెప్పారు. ముడిసరుకుల దిగుమతి విషయంపై ఒక్క దేశం పైనే ఆధారపడకుండా ప్రత్నామ్నాయ మార్గాలను అన్వే షిస్తున్నామని, ఇప్పటికే పలు దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకున్నామని నడ్డా వివరించారు. ఔషధాల తయారీకి ఇతర దేశాల నుంచి ముడి సరుకు దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు కూడా చర్యలు చేపట్టామని చెప్పారు.దీనికిముందు, పశ్చిమాసియాలో పరిస్థితిపై సమీక్షించేందుకు కేంద్ర మంత్రి వర్గం మంగళవారం సమా వేశమైంది. ఇందులో ప్రధానంగా ఎరువుల లభ్యత, సరఫరాపై చర్చించారు. ఖరీ ఫ్ సీజన్ వరకూ ఎలాంటి కొరత లేదని, రైతుల అవసరాలకు సరిపడా సరఫరా చేయ గలమని సమావేశం ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చినట్టు విశ్వసనీయ వర్గాల సమాచా రం. అయితే పశ్చిమాసియాలో సంక్షోభం ఇలాగే కొనసాగితే ఎరువుల ఉత్పత్తి 0.6 నుంచి 0.9 మిలియన్ టన్నుల మేరకు తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి, ఆరోగ్య, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా తదితరులు పాల్గొన్నారు.

# 'పారాక్వాట్'ను నిషేధించండి


**లోక్‌సభలో వరంగల్ ఎంపీ కావ్య**



5లో..

## గోల్డ్ మ్యాన్‌ను 12 గంటల పాటు

# విచారించిన ఐటీ అధికారులు



**ఢిల్లీ:** తెలంగాణ హాకీ చైర్మన్, హోప్ ఫౌండేషన్ ప్రతినిధి, గోల్డ్ మ్యాన్ కొండ విజయ్ కుమార్‌ను ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు గురు వారం అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. దాదాపు 12 గంటలపాటు వివిధ కోణాల్లో ఆయనపై ఐటీ అధికారులు పలు ప్రశ్నలు సంధించారు. విజయ్ పేరుపై ఉన్న స్థిర, చర ఆస్తులపైనా ఆరా తీశారు. హాకీ ఇండియా అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా ఢిల్లీకి వెళ్లిన కొండ విజయ్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నారు.హాకీ అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా గురువారం నాడు ఢిల్లీకి విజయ్ బయలుదేరారు. అయితే, శంషాబాద్ ఎయిర్ పోర్టులోనే అతన్ని అడ్డుకున్న ఐటీ అధికారులు పాన్ కార్డును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతను ఢిల్లీ వెళ్లగా అక్కడి ఐటీ అధి కారులు అదుపులోకి తీసుకున్నారు. విజయ్ ఒంటిపై ఉన్న బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎయిర్ పోర్టులోనే విచారణ ప్రారంభించారు. దాదాపు 12 గంటల పాటు విచారణ సాగింది. అతని అభ్యర్థన మేరకు అవార్డుల ప్రదానోత్సవానికి వెళ్లేందుకు తాత్కాలిక అనుమతి ఇచ్చారు. పిలి చినప్పుడు మరోసారి విచారణకు రావాలని అతనికి చెప్పినట్లు తెలుస్తోంది.

# జైశెట్టి రమణయ్య మృతి

**సంతాపం తెలిపిన బీఆర్ఎస్ అధినేత**



ప్రముఖ చరిత్రకారుడు, కేసీఆర్ గురువు డాక్టర్ జైశెట్టి రమణయ్య కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జగిత్యాలలోని తన నివాసంలో శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. తనకు చదువు చెప్పిన గురువు రమణయ్య మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతిపట్ల సంతాపం ప్రకటించారు.తనకు గురువుగా, అత్యంత ఆత్మీయుడైన రమణయ్యతో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. రమణయ్య సిద్దిపేటలో లెక్చరర్ గా పనిచేస్తున్న సమయంలో, తను ఇంటర్మీడియట్ విద్యార్థిగా తన దగ్గర విద్యన భ్యసించిన సందర్భాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. వారి మరణంతో శోకతప్త హృదయులైన కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రమణయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.కాగా..1971లో సిద్దిపేట జూనియర్, డిగ్రీ కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా డా. జైశెట్టి రమణయ్య పని చేశారు. చిన్న వయ సులోనే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన అరుదైన వ్యక్తిగా, జగిత్యాలలో మొట్టమొదట పొందిన డాక్టరేట్ పొందిన పరిశోధన విద్యార్థిగా ఆయన పేరొందారు. "సౌత్ ఇండియా టెంపుల్స్" అనే పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించి జైశెట్టి రమణయ్య పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను పొందారు.

# దేశ రక్షణలో మరో ముందడుగు

**2.38 లక్షల కోట్లతో యుద్ధ విమానాల కొనుగోలుకు ఆమోదం**



భారతదేశం రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేసుకొనే దిశగా కీలక ముందడుగు పడింది. ఆధునిక పరిస్థితులకు తగ్గట్టుగా సైనిక అవసరాల కోసం భారీగా యుద్ధ విమానాల కొనుగోలుకు డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (ణూజ) ఆమోదం తెలిపింది. రూ.2.38 లక్షల కోట్లతో యుద్ధ విమానాలను కొనేందుకు రక్షణ శాఖకు అనుమతి లభించింది. ఈ విషయాన్ని శుక్రవారం రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ (ఘయఅఫ్ష్ర్ణ్ణ రాఅఅస్త్రష్ట్ర) ఎక్స్ వేదికగా వెల్లడించారు.ఆధునిక కాలానికి తగ్గట్టుగా భారత దేశ సైనిక శక్తిని, తెగువను దుర్భేద్యంగా మార్చుకునే దిశగా మరో అడుగు పడింది. డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ శుక్రవారం రూ.2.38 లక్షల కోట్ల యుద్ధ విమానాల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్త విమానాల కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదన (యాక్సెప్టన్స్ ఆఫ్ నెస్సెసిటీ)కు డీఏసీ అంగీకరించింది. దాంతో, సైన్యం, వాయు సేన, కోస్ట్ గార్డ్ విభాగానికి అవసరమైన యుద్ధ విమానాలను కొనే ప్రక్రియ వేగవంతం కానుంది.



2లో..

# ముఖ్యమంత్రి పదవికి

# 30న నితీశ్ రాజీనామా

# ఢిల్లీలో లాబీ చేస్తా గల్లీలో పని చేస్తా



నూతన రాజకీయ పార్టీపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు.



## ఏప్రిల్ 25న కొత్తపార్టీ

- కవిత కొత్త పార్టీకి ముహూర్తం ఖరారు..
- ఏప్రిల్ 25న జెండా ఆవిష్కరణ
- ఉదయం 10 గంటలకు కొత్త పార్టీ ప్రకటన
- ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు తరలిరావాలి
- యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తాం
- ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి పార్టీ ఏర్పాటు
- బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యం
- అందరూ మెచ్చేలా పార్టీ ఉంటుంది
- సర్వోదయ తెలంగాణ రావాలి
- మేము ఎవ్వరికి బీ పార్టీ కాము
- మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన

**నిజామాబాద్, మార్చి 27:** నూతన రాజకీయ పార్టీపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్ లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఓ మహిళగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమ వుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను. ఈ మట్టి మంచిది. ఇక్కడి నుంచి తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అన్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో ఉన్నప్పుడు.. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయమన్నారు కవిత. రోజు ప్రజల అవస్థలు చూశామని వ్యాఖ్యానించారు. అందుకోసమే ఓ కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. అందరూ మెచ్చేలా పార్టీ ఉంటుందని, సర్వోదయ తెలంగాణ రావాలని కవిత కాంక్షించారు. 'మేము ఎవ్వరికీ బీ పార్టీ కాము. మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పని చేస్తాం. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా కొత్త పార్టీ రాబోతోంది. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు.

# పొన్నారంలో ఘనంగా రాములోరి కళ్యాణం



**జనోదయ, మందమర్రి మార్చి 27:** శ్రీ సీతారామ చంద్ర స్వాముల కళ్యాణ మహోత్సవాన్ని మండలంలోని పొన్నారం గ్రామపంచాయతీలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో కన్నుల పండుగగా నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన కళ్యాణాన్ని తిలకించేందుకు గ్రామస్తులు, హనుమాన్ భక్తులు పెద్ద ఎత్తున తరలిరాగా అభిజిత్ లగ్న సుము హూర్తమున వేద మంత్రాల సాక్షిగా సీతారాముల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. జగదాబి రాముడు సీతమ్మల కళ్యాణ మహోత్సవానికి గ్రామానికి చెందిన నల్లెల్లి ప్రవంతి - వినీత్ దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు మేకల రవళి - వంశీ దంపతులు సమర్పించారు. సీతమ్మ తరుపున గ్రామ ఉప సర్పంచ్ పెంచాల అమృత - రాజలింగు, శ్రీ రాముని తరుపున బొలిశెట్టి సునీత - జనార్ధన్ దంపతులు పాల్గొనీ శ్రీ సీతా రాముల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. అశేష భక్తవాహిని తరలిరాగా జవదాభిరాముడు సీతమ్మకు అభిజిత్ లగ్న సుముహూర్త మున వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. కళ్యాణ వైభోగాన్ని తిలకించేందుకు గ్రామస్తులు, హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించి భక్తి పారవశ్యంతో పులకించారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేయగా, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

# పెళ్లైన పురుషుడు సహజీవనం చేయటం తప్పు కాదు..

అలహాబాద్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. పరస్పర అంగీకారంతో పెళ్లైన పురుషుడు, వయోజనురాలైన (మేజర్) మహిళతో సహజీవనం చేయటం తప్పుకాదని, సదరు పురుషుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవటం కుదరదని కోర్టు తేల్చి చెప్పింది. పౌరుల హక్కులను పరిరక్షించేందుకు తాము తీసుకునే చర్యలు సామాజిక అభిప్రాయం లేదా నైతికతకు లోబడి ఉండవని స్పష్టం చేసింది. ఉత్తర ప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌కు చెందిన ఓ పెళ్లైన పురుషుడు, పెళ్లి కాని అమ్మాయి సహజీవనం చేస్తున్నారు. యువతి తల్లి ఆ జంటపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వారిపై కేసు ఫైల్ చేశారు. ఈ నేపథ్యంలో పోలీస్ కేసును కొట్టి వేయాలంటూ జంట అలహాబాద్ కోర్టును ఆశ్రయించింది. కోర్టులో క్రిమినల్ రిట్ పిటిషన్ వేసింది. జంట వేసిన రిట్ పిటిషన్‌పై కోర్టు తాజాగా విచారణ జరిపింది. జంటకు మద్దతుగా తీర్పును వెలువరించింది. నైతికత వేరు చట్టం వేరని కోర్టు పేర్కొంది. జంటను అరెస్ట్ చేయవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. యువతి కుటుంబసభ్యుల నుంచి జంటకు ఎలాంటి హానీ కలుగకుండా చూసుకోవాలని కూడా ఆదేశించింది. జంట ఇంటికి వెళ్ల వద్దని యువతి కుటుంబసభ్యులకు సూచించింది. నేరుగా లేదా ఫోన్ ద్వారా లేదా థర్ట్ పార్టీ ద్వారా జంటతో సంప్రదింపులు కూడా జరపవద్దని అంది. జంట భద్రతను స్థానిక పోలీస్ చీఫ్‌కు అప్పగించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 8వ తేదీకి వాయిదా వేసింది.

# వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం



**జనోదయ : శేర్లింగంపల్లి**

ప్రగతి ఎన్‌క్లేవ్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల వారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కాలనీ అధ్యక్షులు అట్టేపల్లి రామప్రభు అధ్యక్షత వహించారు. ఈ పవిత్ర వేడుకలో అమ్మాయి తరఫున అట్టేపల్లి పురుషోత్తం,దయాకర్ వారి కుటుంబ సభ్యులు, అబ్బాయి తరఫున నాగిశెట్టి ప్రసాద్ పిల్లి నాగరాజు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని శోభాయమానం చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముప్వ సత్యనారాయణ మియాపూర్ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్,రఘునాథ్ రెడ్డి,పురుషోత్తం యాదవ్ రామకృష్ణ గౌడ్ మహేష్ యాదవ్,గంగాధర్,నాగులు పటేల్. కిరణ్ యాదవ్ అట్టేపల్లి పురుషోత్తం సమ్మెట ప్రసాద్ , అట్టేపల్లి శ్రీరాములు , అట్టేపల్లి దయాకర్ , పిల్లి నాగరాజు డాక్టర్ రవికుమార్ రాజేంద్ర ప్రసాద్ చౌదరి మొహమ్మద్ కాజా నాగిశెట్టి వినీత్ తంగెళ్ల సాయి తేజ అట్టేపల్లి ప్రశాంత్ నాయుడు చంద్రహస్ రాజశేఖర్ గిరి వినోద్ శ్రీకాంత్ చంద్రికా కల్పన ప్రీతి కమిటీ సభ్యులు కాలనీ మరియు మీడియా మిత్రులు పుట్ట వినయ్ మరియు కబీర్. ఎ ఆర్ పి టీం సభ్యులు పాల్గొన్నారు. ఈ వేడుకలో కాలనీ నివాసితులు భక్తిశ్రద్ధలతో పాల్గొని, శ్రీ సీతారాముల వారి దివ్య కల్యాణాన్ని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఎంతో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసి, పాల్గొన్న భక్తులకు భోజన సదుపాయం కల్పించారు. ఈ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు నిర్వాహక కమిటీ సభ్యులకు, సహకరించిన అందరికీ అధ్యక్షులు అట్టేపల్లి రామప్రభు కృతజ్ఞతలు తెలిపారు.

# ముఖ్యమంత్రి పదవికి 30న నితీశ్ రాజీనామా



**పాట్నా:** బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మార్చి 30న సీఎం, ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉంది. ఈనెల 16న రాజ్యసభకు నితీశ్ ఎన్నికయ్యారు. రాజ్యాంగ ప్రకారం ఒక వ్యక్తి ఒకేసారి రెండు సభల్లో పదవులు నిర్వహించరాదు. ఒక పదవిని 14 రోజుల్లోపు వదులుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం బిహార్ శాసనసభ, శాసన మండలికి మార్చి 29 వరకూ విరామం ఇచ్చారు. తిరిగి ఉభయసభలు ఈనెల 30న సమావేశమవుతాయి. అదే రోజు నితీశ్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయనుండటం దాదాపు ఖారారైందని చెబుతున్నారు. మార్చి 16న బిహార్ నుంచి రాజ్యసభకు నితీశ్ ఎన్నికయ్యారు. మొత్తం 37 రాజ్యసభ స్థానాలకు ఖాళీ ఏర్పడగా, బిహార్, ఒడిశా, హర్యానాలోని 11 సీట్లకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. తక్కిన స్థానాలకు ఎన్నికలకు ముందే పోటీలేకుండా అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# లాలాపేటలో వసంత నవరాత్రి వైభవం

**శ్రీ సీతారాముల కళ్యాణానికి ఘన ఏర్పాట్లు**



**జనోదయ, గ్రేటర్ హైదరాబాద్, మార్చి 28:**

సికింద్రాబాద్ డివిజన్ లాలాపేటలోని శ్రీ సీతారామాంజనేయ భజన సమాజము ఆధ్వర్యంలో వసంత నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ సీతారామాంజనేయ భజన సమాజ సభ్యులు తెలిపారు. ఉగాది పర్వదినం నుండి మార్చి 27 వరకు ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1934లో స్థాపితమైన శ్రీ సీతారామాంజనేయ భజన సమాజంలో 1995లో శ్రీ రామాలయ విగ్రహ ప్రతిష్ఠ జరగగా, 2000లో శివపంచాయతులు మరియు నవగ్రహాల ప్రతిష్ఠాపన జరిగినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే వసంత నవరాత్రి ఉత్సవాలు ఈ ఏడాది మరింత వైభవంగా జరపడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. శ్రీ రామ నవమి పురస్కరించుకొని శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో సమాజ కార్యవర్గం, సలహాదారులు, పాలక మండలి సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# విశ్వకర్మ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలి




**జనోదయ, గ్రేటర్ హైదరాబాద్, మార్చి 28:**

విశ్వకర్మ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు రాజకీయ రంగంలో కూడా ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించాలని వారు పిలుపునిచ్చారు. నరేంద్ర నగర్ కమ్యూనిటీ హాల్ లో ఆల్ ఇండియా శ్రీ విరాట్ విశ్వకర్మ ఉమెన్ యూత్ ఫెడరేషన్( ఏఐవిఎఫ్) అంబర్ పేట డివిజన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ సతీమణి స్రవంతి. సీనియర్ జర్నలిస్టు జూలూరు పుండరీ చారి, ఏఐవిఎఫ్ జాతీయ వ్యవస్థాపకులు జైన్ విశ్వకర్మ, జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు సురేష్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు మహిళా సాధికారికతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాజకీయంగా విశ్వకర్మ మహిళలు అభివృద్ధి సాధించాలని వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో అంబర్ పేట నియోజకవర్గం లో ఒక్క డివిజన్లోనైనా పోటీ చేసి విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు. విశ్వకర్మ మహిళలు చట్ట సభల్లో ప్రవేశించి విశ్వకర్మ ఖ్యాతిని నల దిశలో చాటి చెప్పాలని వారు కోరారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ఏఐవిఎఫ్ అంబర్పేట డివిజన్ అధ్యక్షురాలు కం దోజు స్వాతిని శాలువతో ఘనంగా సత్కరించారు, ఈ కార్యక్రమంలో ఉమెన్ వింగ్ ప్రధాన కార్యదర్శి అరునాజి రోజా, ఉపాధ్యక్షురాలు కందోజు రేఖ. కంచి రాదా, సంయుక్త కార్యదర్శి భైరోజు స్రవంతి, సలహాదారులు తూపుకుల లక్ష్మీదేవి, సభ్యులు వి రమాదేవి, బి మాధవి, స్వప్న, వరలక్ష్మి, రజిని, వాణి, శ్రీలక్ష్మి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు

# పౌనూర్‌లో మొదటిసారి శ్రీరామనవమి



**జనదయ : చెన్నూర్ ఆర్సీ**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పౌనూర్ గ్రామంలో మొదటిసారి శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శ్రీరాముని కళ్యాణంకు పట్టు వస్త్రాలను పౌనూర్ గ్రామ సర్పంచ్ వేముల సుధా తిరుపతి గౌడ్ మరియు గ్రామస్తుల సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సీతారాముల కళ్యాణం గ్రామ శ్రేయస్సు కోసం నిర్వహించడం జరిగిందన్నారు. రాములోరి కళ్యాణం మొదటిసారి గ్రామంలో జరగడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం కళ్యాణం నిర్వహిస్తామని తెలిపారు. విగ్రహ దాతలు పౌనూర్ గ్రామానికి చెందిన తుమ్మల మధుసూదన్ రెడ్డి కుమారుడు తుమ్మల సుమిత్ర వేణుగోపాల్ రెడ్డి పౌనూర్ గ్రామంలో జరిగే మొదటిసారి శ్రీరాముని కళ్యాణానికి శ్రీరాముడు, సీత, లక్ష్మణ, హనుమంతుడి విగ్రహాలను ఆలయ కమిటీకి సమర్పించారు. శ్రీరామ నవమి కళ్యాణ వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. హరీష్ వేదపండితులు మంత్రోచ్చరణాల మధ్య సీతారాముల కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పౌనూర్ వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ వివాహ హోత్సవంలో పాల్గొన్నారు. వందల మంది భక్తుల మధ్య సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది.వేడుకల్ని భక్తులు ఎంతో ఆసక్తిగా తిలకించారు

# పొన్నారంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం




**జనోదయ, మందమర్రి మార్చి 27:**

మండలంలోని పొన్నారం గ్రామంలో సీసీ రోడ్డు పనులు గ్రామ సర్పంచ్ పెంచాల మధు ప్రారంభించారు. ఎమ్ ఎన్ఆర్ ఈజిఎస్ నిధులు 13.80 లక్షల వ్యయంతో 3వ వార్డులో చేపట్టనున్న సిసి రోడ్డు పనులు శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా పాలనలో గ్రామాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ల సహకారం తో గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామా ల అభివృద్ధితో పాటు మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.ఈ కా ర్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పెంచాల అమృత, వార్డ్ స భ్యులు సురిమిల్ల పద్మ, మేకల వంశీ , బోరకుంట లక్ష్మణ్, సంకే శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పెంచాల రాజలింగు, ఈజి ఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య పాల్గొన్నారు,

## బూరుగుపల్లిలో ఘనంగా శ్రీ సీతారామచంద్ర స్వామివారి

# కల్యాణ మహోత్సవం



**జనోదయ : గంగాధర మార్చి 27:**

గంగాధర మండలం బూరుగుపల్లి ( శాల్మలిపురం) గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం అంతా పండుగ వాతావరణంలో కళకళలాడింది. గ్రామంలోని గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఫౌండర్ లంక భాగ్యమ్మ (కీ.శే. లంక లింగయ్య) స్మారకార్థం ఆధ్వర్యంలో నిర్వహించగా, చైర్మన్ లంక మాలతి--సతీష్, బత్తిని భవాని--తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లు ఘనంగా చేపట్టారు. కార్యక్రమం విజయవంతం కావడానికి శ్రీ సీతారామచంద్ర స్వామి భక్త బృందం సభ్యులు విశేష కృషి చేశారు.కల్యాణ మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై భక్తి భావంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో ఐక్యతను పెంపొందిస్తాయని, భక్తి భావాన్ని బలపరుస్తాయని తెలిపారు.భక్తులు స్వామివారిని దర్శించుకుని కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కార్యక్రమం మొత్తం భక్తి, ఆనంద వాతావరణంలో సాగింది.

# బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశ సీట్లు సాధించిన నాగారం విద్యారినిలు



**అభినందించిన గ్రామ సర్పంచ్ బెల్లంకొండ శ్రీదేవి - సత్యనారాయణ రెడ్డి**

**జనోదయ, మంథని:**

మంత్రి మండలం నాగారం గ్రామానికి చెందిన బూడిద కిరణ్ కూతురు అనన్య భోగె సంజీవ్ కూతురు అనునిత్య లు రామగుండం బాలికల గురుకుల పాఠశాలలో 5 వ తరగతి లో సీటు సాధించినందుకు వారిని అభినందిస్తూ వార్డు సభ్యులు దాసరి రవీందర్, ఎరుకల రాజశేఖర్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించి విద్యార్థినులను, వారిని తల్లిదండ్రులను శాలువలతో సన్మానించి నోట్ బుక్ లు, పెన్నులు ఇచ్చి ప్రోత్సహకం ఇవ్వడం జరిగింది.గ్రామ పెద్దలు బెల్లంకొండ దయాకర్ రెడ్డి విద్యార్థినులకు 2 వేల రూపాయల ఆర్థిక ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగారం గ్రామ సర్పంచ్ బెల్లంకొండ శ్రీదేవి – సత్యనారాయణ రెడ్డి రిటైర్డ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బూడిద రాజయ్య,కార్యదర్శి వికాస్ హాజరైన ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఎరుకల లలిత వార్డు సభ్యులు బూడిద తిరుపతి బూడిద శ్రీకాంత్ తోకల శైలజ జక్కుల భాగ్యలక్ష్మి కుమార్ చిప్ప సత్తమ్మతోపాటు గ్రామ పెద్దలు పిఏసిఎస్ మాజీ వైస్ చైర్మన్ బెల్లంకొండ ప్రకాష్ రెడ్డి బూడిద శంకర్ మద్దెల శ్రీనివాస్ నల్లి శ్రీనివాస్లతో పాటు ఎరుకల సుమన్, జక్కుల శ్రావణ్ , బూడిద గట్టయ్య, గ్రామ రేషన్ డీలర్ బెల్లం కొండ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

# శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న దుద్దిళ్ల శ్రీను బాబు



**ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన శ్రీను బాబు**

**జనోదయ, మంథని:**

మంథని పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో,శ్రీరామ్ నగర్ లో శ్రీరామ దేవాలయంలో శ్రీ రామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఘనంగా నిర్వహించిన సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ సీతారాముల వారి ఆశీస్సులు పొందారు.అనంతరం భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉజ్జ్వలంగా తీర్చిదిద్దారు. టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఐశ్వర్యాలతో, పాడి పంటలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని కోరుకున్నారు.



# చిర్రకుంటలో ఘనంగా సీతారాముల కళ్యాణం

**జనోదయ : మందమర్రి మార్చి 27:**

శ్రీరామనవమి పురస్కరించు కొని శుక్రవారం మండలంలోని చిర్రకుంట గ్రామంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకలు పురస్కరించుకొని ఆలయ ప్రాంగణాన్ని అత్యంత సుందరంగా అలంకరించారు. కళ్యాణ మహోత్సవంలో గ్రామస్తులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొనగా, భక్తులకు తీర్థప్ర సాదాలు అందజేసి, అనంతరం అన్నదానం, మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాంటెంకి శ్రీలత – తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దల రాజయ్య, సిద్ధం జనార్ధన్, ఓదెలు, సంపత్ రావు, దుర్గం ప్రభాకర్, ఒడ్నాల సాయి,కామెర బాలయ్య,అత్తి పోశయ్యలు పాల్గొన్నారు.

# వృద్ధులకు దోతులు పంపిణీ



**జనోదయ, హనుమకొండ, మార్చి 27:** స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయి కుమార్ మాట్లాడుతూ హనుమకొండ నగరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు ధోతులు(పంచలు), పండ్లు పంపిణీ, పండగ సందర్భంగా వృద్ధుల ముఖంలో చిరునవ్వు చిగురించేలా వారికి పండగ పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ మాధ్యమాల్లో సేవలు అందించారు. వృద్ధులు బయటకు వచ్చి పండుగను సంతోషంగా జరుపుకోలేని పరిస్థితి ఉంది. కాబట్టి వారికి ఒక చిన్న సహాయాన్ని అందించడం సంతోషంగా ఉంది,స్వేరోస్ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ సూచన సలహాల మేరకు పనిచేస్తున్న స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శ్రీరాముని జీవితం అందరికీ ఆచరణీయం

**-రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద-**

**జనోదయ : మందమర్రి మార్చి 27:**

శ్రీ రాముని జీవితం మన అందరికీ ఆదర్శనీయమని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించు కొని జిల్ మందమర్రి మండలం పాలచెట్టు ప్రాంతంలో గల శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర మంత్రి సతీమణి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహసిల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు లతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు. శ్రీరాముడు నీతి, నిజాయితీ ఆచరించి ఆదర్శనీయంగా నిలిచారని, ఆధ్యాత్మిక మార్గం ద్వారా మనశాంతి కలుగుతుందన్నారు. శ్రీరాముని ఆశయాలను అందరం అనుసరించాలని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో ప్రజల సౌకర్యార్థం సిసి రహదారులు, మురుగు కాలువ వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రజలకు వేసవిలో త్రాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మందమర్రి మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయల వ్యయంతో పనులు చేపట్టడం జరుగుతుందని, ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఒక మనిషి జీవన విధానాన్ని శ్రీరాముడు ఆచరించి చూపారని, నీతి, నిజాయితీ కలిగి ఉండాలని తెలిపారు. శ్రీరాముడు ఆచరించిన జీవన విధానం అందరికీ ఆదర్శంగా నిలిచిందని



తెలిపారు. శ్రీరాముడి స్ఫూర్తితో జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పండుగలకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**
**గంగాధర మండలంలో శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే**

**జనోదయ : గంగాధర మార్చి 27:**



గంగాధర మండలంలోని ఉప్పర మల్యాల, కురిక్యాల, మధురానగర్ గ్రామాల్లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు చేశారు. ఉప్పరమల్యాలలో కొండగట్టు దేవాలయం నుంచి వచ్చిన పట్టు వస్త్రాలను స్వామివారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం పండుగలకు ప్రత్యేక గుర్తింపు నిస్తోందని పేర్కొన్నారు. ప్రజలు శ్రీరామ నవమి వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, మండల సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, కురి క్యాల సర్పంచ్ కాదరి హారిక కను కయ్య, వేముల భాస్కర్,రెండ్ల శ్రీనివాస్, బాస వేణి శ్రీనివాస్,కర్ర బాపు రెడ్డి,మేర్జ కొండయ్య, గుండారపు మధు,కనకట్ల తిరుపతి, కర్ర కార్తిక్ రెడ్డి, మ్యాక వినోద్,గుండారపు సంపత్,అదుర్తి ఎల్లయ్య, రాగుల సుధాకర్,శనిగరపు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ భక్తులకు మజ్జిగ పంపిణీ



**జనోదయ, బెల్లంపల్లి, మార్చి 27:**

బెల్లంపల్లి పట్టణంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా బెల్లంపల్లి బజార్ ఏరియా నుండి కోదండ రామాలయంలో జరిగే సీతారాముల కళ్యాణ వేడుకలకు వెళ్లే భక్తులకు శుక్ర వారం హనుమాన్ బస్తీకి చెందిన పసులోటి రాధా కుటుంబ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. సీతారాముల కళ్యాణాన్ని వీక్షించే భక్తుల దాహార్తిని తీర్చడం కోసమే తాము మజ్జిగ పంపిణీ చేసినట్లు పసులోటి రాధ కుటుంబ సభ్యులు తెలిపారు. రామ భక్తులకు సేవ చేయడం సాక్షాత్తు శ్రీరాముడికి సేవ చేయడంగా భావిస్తున్నట్లు చెప్పారు.

# ఓ-సిటీని మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతాం: ఇనగాల



**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ) మార్చి 27**

శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ నగరంలోని ఓ-సిటీలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ వేడుకల్లో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ.. ఓ-సిటీతో తనకు ఎంతో కాలంగా ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తుచేశారు. కాలనీవాసుల సమస్యల పట్ల తనకు పూర్తి అవగాహన ఉందని, కుడా చైర్మన్ హోదాలో ఓ-సిటీని వరంగల్ నగరంలోనే ఒక ఆదర్శవంతమైన మోడల్ కాలనీగా మార్చే బాధ్యతను తాను తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతి కుంట చెరువు సుందరీకరణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే వినోద్

**జనోదయ, బెల్లంపల్లి, మార్చి 27:**



బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 25 వ వార్డు పరిధిలో గల జాతి కుంట చెరువు సుందరీకరణ పనులకు శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ లాంఛనంగా శంకుస్థాపన చేశారు.రూ 1కోటి 56 లక్షల వ్యయంతో ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ మాట్లాడారు. బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకమైన ప్రాధాన్యత కల్పిస్తుందని చెప్పారు. జాతి కుంట చెరువు సుందరీకరణ పనులు పూర్తయితే బెల్లంపల్లి ప్రాంతం మరింత అందంగా మారుతుందని తెలిపారు. చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బెల్లంపల్లి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, మున్సిపల్ అధ్యక్షురాలు దావ స్వాతి రమేష్, 25వ వార్డు కౌన్సిలర్ కంకటి ప్రణీత, 9వ వార్డు కౌన్సిలర్ కంపెల్లి రాజ్యం, మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి తో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# గడ్డి మందును పూర్తిగా నిషేధించాలి

**లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

**జనోదయ, హనుమకొండ, మార్చి 27:**



దేశవ్యాప్తంగా తీవ్ర ఆరోగ్య, పర్యావరణ ప్రమాదాలకు కారణమవుతున్న పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) అనే అత్యంత ప్రమాదకర హర్బిసైడ్‌పై తక్షణమే పూర్తి నిషేధం విధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని లోక్‌సభలో డిమాండ్ చేశారు. శుక్రవారం పార్ల మెంట్ జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు) వినియోగం వల్ల నేల, నీరు, ఇసుక తీవ్రంగా కాలుష్యం అవుతున్నాయని, దీని ప్రభావం వ్యవసాయ వ్యవస్థలపై తీవ్రమవుతోందని ఎంపీ స్పష్టం చేశారు. ఇది కేవలం పర్యావరణానికే కాకుండా ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రాణాంతక ముప్పు గా మారిందని అభిప్రాయపడ్డారు.గ్రామీణ ప్రాంతాల్లో ఆత్మహత్యలకు "మారణాయుధం"గా మారిందని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు.

# వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

**పలుచోట్ల పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు**

**జనోదయ, బెల్లంపల్లి, మార్చి 27:**



బెల్లంపల్లి నియోజకవర్గంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. బెల్లంపల్లి పట్టణంలోని శ్రీ కోదండ రామాలయం, బెల్లంపల్లి బస్తీలోని శ్రీ రామ భజన మందిరం ,బెల్లంపల్లి మండలంలోని కన్నాల శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయాల్లో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే గడ్డం వినోద్, రమ దంపతులు పాల్గొన్నారు. అదేవిధంగా బెల్లంపల్లి రైల్వే స్టేషన్ ప్రాంతంలోని రామాలయం, టేకుల బస్తి రామాలయం, తాండూర్ మండలంలోని బోయపల్లి శ్రీ హనుమాన్ మందిర్, బెల్లంపల్లి మండలంలోని ఆకెనెపల్లి,అంకుశం గ్రామాల్లోని హనుమాన్ దేవాలయాల్లో కన్నుల పండుగగా శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. నియోజకవర్గంలోని నెన్నెల్, తాండూర్, కాజీపేట, కన్నెపల్లి, భీమిని మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. శ్రీరామ నవమి వేడుకల్లో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

# కిష్టాపూర్ గ్రామంలో ఘనంగా సీతారాముల కళ్యాణం



జనోదయ : బీర్కూరు

బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో శ్రీ సీతారాముల దివ్య కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం మొత్తం పచ్చని తోరణాలు, రంగురంగుల పూల అలంకరణలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించబడింది. .వేద పండితులు వేద మంత్రాల ఘోషల మధ్య, సంప్రదాయ విధానాల ప్రకారం సీతారాముల కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, హారతుల మధ్య కళ్యాణ కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తింది.మహోత్సవానికి కిష్టాపూర్ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుండి భారీగా భక్తులు తరలివచ్చారు. మహిళలు, యువకులు, వృద్ధులు భక్తి భావంతో పాల్గొని స్వామివారి దివ్య దర్శనం పొందారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాలు, అన్నదానం నిర్వహించి అందరికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మానేవ్వా గాంగొండ, ఉప సర్పంచ్ హట్కరి కృష్ణ,కిష్టాపూర్ వార్డ్ సభ్యులు,గ్రామ పెద్దలు, యువత,మహిళలు,గ్రామ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీరామనవమి సందర్భంగా...

# సీతమ్మ కళ్యాణం...రామయ్య వైభోగం

జనోదయ : వేములవాడ ఆర్ సి

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి సందర్భంగా ఆలయ పార్కింగ్ ప్రాంగణంలోని శివార్చన వేదికపై శ్రీ సీతారాముల స్వామివారి కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదికను రంగురంగుల పూలతో, మామిడి ఆకులు, అరటి తోరణాలతో అద్భుతంగా అలంకరించారు. సీతా రామచంద్ర కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తరపున రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ,ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పట్టు వస్త్రాలను జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ కు, ఆలయ ఈవో ఎల్. రమాదేవికి అందజేశారు. అదేవిదంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ తరపున కూడా ఆలయానికి పట్టు వస్త్రాలు సమర్పించబడ్డాయి. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు కూడా పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి రాగానే అర్చకులు, వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి మండపంలో ఆలయ ఈవో స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి కన్యాదాతలుగా మరి ఒంగంటి విజయసారథి--కర్ణ దంపతులు పాల్గొన్నారు.ఈ కళ్యాణోత్సవాన్ని దర్శించేందుకు రాష్ట్ర నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చినారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని విధాలుగా సదుపాయాలు కల్పించారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే, వేములవాడ ఆర్డీఓ రాధా బాయి, ఆలయ అధికారులు, ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.





# కమనీయం... రమణీయం..

# వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం



జనోదయ : చందుర్తి

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని చందుర్తి మండల కేంద్రంతో పాటు జోగాపూర్ గ్రామ శివారు శ్రీ రామాలయంలో, లింగంపేట, కట్ట లింగంపేట, మల్యాల గ్రామాల్లో శుక్రవారం కమనీయంగా...రమణీయంగా... శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు.దేవత ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువచ్చి కళ్యాణ మండప వేదికలో తీర్చి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమకూర్చగా ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో సంప్రదాయంగా శాస్త్రకంగా ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి శ్రద్ధలతో భక్తులు శ్రీ సీతారాముల కళ్యాణాన్ని తిలకించి వీక్షించి మొక్కులు సమర్పించారు.శ్రీరామ నామస్మరణాలతో మార్మోగింది. సీతారాముల కళ్యాణ ఉత్సవాల్లో భక్తులు తనయత్వం పొందారు. హనుమాన్ దీక్షకారులు శ్రీరామ నామస్మరణతో భజనాలు చేశారు.ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, రాజకీయపక్ష నాయకులు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.శ్రీ సీతారాముల కళ్యాణం తంతు తర్వాత అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## రామాలయం ఆవరణలో

# 2 కోట్లతో కళ్యాణ మండపం ఏర్పాటు చేస్తాం



- కోల్ బెల్టులో ఆలయాలకు కొత్త రూపురేఖలు
- మున్సిపల్ కార్యాలయం సమీపంలో వినాయక విగ్రహం
- నగర సుందరీకరణ కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- శ్రీ రామ నవమి ఉత్సవాల్లో రామగుండం ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్

**జనోదయ, గోదావరిఖని, మార్చ్ 27:**

శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా శుక్రవారం గోదావరిఖని శ్రీ కోదండ రామాలయంలో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్- మనాలి ఠాకూర్, నగర మేయర్ మహంకాళి స్వామి దంపతులు పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు- తలంబ్రాలు సమర్పించారు. ఆలయంలో ఉన్న సీతారామ లక్ష్మణ స్వాముల ఉత్సవ విగ్రహాలను ఒక వేదికపై ఏర్పాటు చేసి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, నగర మేయర్, సింగరేణి జీఎం లలిత్ కుమార్ దంపతులు, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కోదండ రామాలయం ఆవరణలో 2 కోట్ల నిధులతో కళ్యాణ మండపం నిర్మిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. తద్వారా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా దానిని తీర్చిదిద్దుతామన్నారు. కోట్లాది రూపాయల నిధులతో నగరాన్ని సుందరీకరణ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక నగరంగా ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. ఇదే క్రమంలో హనుమాన్ జంక్షన్ బి. పవర్ హౌస్ వద్ద భారీ హనుమంతుని విగ్రహం ఏర్పాటు, సమ్మక్క జాతర ఆవరణలో సకల సదుపాయాలు కల్పించామన్నారు. రామగుండం కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో వినాయకుని విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.